అమ్మ

(కవితా సంపుటి)

రచన

డా॥ (శ్రీమతి) వాసా ప్రభావతి
ఎం. ఎ. పి. హెచ్. డి.

లెక్చరర్.

హైదరాబాదు

వాసా ప్రచురణలు

మలక్‌పేట. హైదరాబాద్-500 036.

అమ్మ కవితా సంపుటి

రచన డా॥ వాసా ప్రభావతి

ప్రథమ ముద్రణ

డిశంబరు 1980

వెల రూ. 5-00

ముఖచిత్రం శీలా వీర్రాజు

ముద్రణ

బాలాజీ ఫైన్ ఆర్ట్ ప్రింటర్స్

మునిసిపల్ కాలనీ, మలక్‌పేట

హైదరాబాదు-36.

ప్రతులకు

వాసా ప్రచురణలు

11/2 ఆర్.టి. మునిసిపల్ కాలనీ మలక్‌పేట

హైదరాబాద్-36.

నవయుగ బుక్ హౌస్

సుల్తాన్ బజార్ హైదరాబాదు.

అంకితం

మా అమ్మ

శ్రీమతి కాశీవఝుల

లక్ష్మీదేవమ్మగారికి

ప్రేమతో

కృ త జ్ఞ త లు

ఎందరో మహానుభావులు. ఈ పుస్తకం ప్రచురించడానికి సహకరించిన అందరికి వందనాలు.

అభిప్రాయం వ్రాసి యిచ్చిన మా గురువులు డా॥ సి. నారాయణరెడ్డిగారికి ఆస్థాన కవులు డా॥ దాశరథిగారికి, ఎడ్వర్టైజ్‌మెంటు ఇప్పించిన ఆంధ్రా బ్యాంక్ పి.ఆర్.ఓ శ్రీ కె. వి. భాస్కరరావుగారికి.

అందంగా ముఖపత్ర చిత్రం వేసిన శీలా వీర్రాజుగారికి పుస్తకం ప్రింటు చేసిన బాలాజీ ఆర్ట్ ప్రింటర్స్ వారికి.
హార్ధిక కృతజ్ఞతలు.

ఈ 'అమ్మ' పుస్తకాన్ని 'మా అమ్మకు' అంకితమివ్వడానికి ప్రేరణ చేసిన మా మేనమామ జటావల్లభుల పురుషోత్తంగారి కుమార్తె నాకాత్మీయురాలు శ్రీమతి మర్ల సావిత్రికి నాకృతజ్ఞతలు.

అభిప్రాయం

సృష్టికి మూలం అమ్మ
కమ్మని వాత్సల్యసృష్టికి ఆలవాలం అమ్మ
అమ్మ రూపానికి సామ్యగింపలేము
అమ్మ హృదయానికి ఉపమానసామగ్రి అందివ్వలేము
అయినా 'అమ్మను' రకరకాల
కోణాలతో దర్శించడానికి ప్రయత్నించింది
రంజని డా॥ వాణి ప్రకాశ్
అమ్మను గూర్చి వ్రాసిన ఈ కవితా సంపుటి
ఆర్ద్రహృదయుల ఆదరణ పొందుతుందని
ఆశిస్తున్నాను.

డా॥ సి. నారాయణరెడ్డి

అమ్మ మీద కమ్మని కవిత

కళాప్రపూర్ణ డా॥ దాశరథి

(ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి)

అమ్మను అనేక కోణాల్లో, చూపిస్తూ వ్రాసిన కవితలు కల్పించి, పాఠకులను పులకింపజేసిన కవయిత్రి మహోన్నతత్వం కనిపిస్తుంది ఈ కవితా సంపుటి చదివితే

బహుముఖ ప్రజ్ఞావతియైన సోదరి డా॥ వాసా ప్రభావతి. తల్లిని పాల వెల్లిగా కల్పవల్లిగా చూపించారు అమ్మను గురించి ఒకటీ అరా కవితలు అంతా వ్రాసి ఉండవచ్చు కాని అన్నీ కవితలూ అమ్మ మీదే వ్రాసి ప్రచురించినవారు లేరనే నాకు అనిపిస్తుంది. నిజానికి అమ్మ అటువంటి విస్తృత కవితా వస్తువు.

తల్లిలేని ఇల్లేమి ఇల్లు ? అని హతార్క్స్ అన్నాడు చిన్న పిల్లల పెదవుల మీదా, హృదయాల్లోన ఉన్న 'తల్లి' పేరే దేవుడు-అన్నాడు ఠాకరే

ఉయ్యాల నూపే ఒయ్యారి చేయి

ఇలనెల్ల పాలించగలిగేటి చేయి-అన్నాడు రాస్

మరి డా॥ ప్రభావతిగారు :-

"భావాలకు రెక్కలు

విప్పేది అమ్మ

చివరకు తండ్రిని కూడా

పరిచయం చేసేది అమ్మ",

అన్నారు. గొప్ప సత్యాన్ని కవితారూపంగా అందించిన డా॥ ప్రభావతి గారికి అభినందనలు. తండ్రిని పరిచయం చేయవలసింది తల్లే కదా !

గురువుకు గురువు అమ్మ, అనికూడా అన్నాడు ప్రజాపతి. ఏ గురువూ మలచలేని రీతిని పిల్లలను చక్కగా తీర్చిదిద్దగలది అమ్మ మాత్రమే

ప్రతి ఫలం కోరని

దాత అమ్మ

అవును ఇది స్థిర సత్యం. చాలా మంది దాతలు పేరుకోసం దానం చేస్తారు. తల్లికి ప్రతిఫలాపేక్ష లేదు.

యూదుల సామెత ఒకటి వుంది ;

„దేవుడు అన్నిచోట్లా ఉండలేడు గనుక అమ్మలను సృష్టించాడు’ అన్నదే ఆ సామెత.

అందుకని అమ్మ ప్రత్యక్ష దైవం

‘‘అమ్మ ప్రేమకు
ఆనకట్టలు లేవు,

అమ్మ ప్రేమకు
వర్ణాలు సవరణలు లేవు

త్రాసుకే తూకం
నేర్పేది అమ్మ

అమ్మ ప్రేమ
అమర నది కన్నా నిర్మలం

అమ్మ ప్రేమ
ఊట బావి
ఎంత చేదుకున్నా తరగదు

పై సూక్తులు శాశ్వతంగా హృదయాలలో నిలిచి పోతాయి.

ఇది అమ్మ స్తవనం కాదు, ఇది వాస్తవం

అతిశయోక్తి అనిపించని అందాలకవనం

గోర్కీ అమ్మ అనే నవలను వ్రాసి అమరుడయ్యాడు అమ్మనూ అమరు రాలిని చేశాడు.

సోదరి ప్రభావతిగారు కూడా తెలుగమ్మకు కమ్మని కవిత ద్వారా రూపం చేసి మన హృదయాల కోవెల్లో నిలిపారు. తన కవితను అమరం చేసుకున్నారు. సోదరి డా॥ వాసా ప్రభావతిగారి ఈ నూతన ప్రయో గానికి అభినందనలు.

అమ్మను తన అమ్మకే అంకితం చేశారు.

అలాంటి అమ్మకు స్వాగతం

రౌద్రి సంక్రాంతి
హైదరాబాదు

అందరికి అమ్మ ఉంది

తెనుగు తేనెల
తేలియాడింది 'అమ్మ'
అచ్చ తెనుగు
అంద చందాలలో
ఆటలాడింది 'అమ్మ'
తత్వ మాల
గాంభీర్యంలో
పడగలెత్తింది అమ్మ
మాతా అన్నా
మా అన్నా
మమ్మీ అన్నా
అమ్మాజాన్ అన్నా
అన్ని జాతుల వారికి
అని భాషల వారికి
అన్ని మతాల వారికి
అందరికి అమ్మ ఉంది
ఈ ప్రకృతిలో ప్రతి జీవికి
'అమ్మ' ఉంది.

అమ్మ

బంగారము కన్న
ఖరీదు అమ్మ
తేనె కన్న
తీపి అమ్మ
దేవుని మించిన
దైవం అమ్మ
ప్రేమకు ప్రతి
రూపం అమ్మ
ధనానికి దొరకని
పెన్నిధి అమ్మ
అమ్మ లోనె ఉన్నాయి
లోకాలు అన్ని
అమ్మ తోనె ఉన్నాయి
ఆనందాలు అన్ని
అమ్మ తోనె ఉన్నాయి
సుఖాలు అన్ని
అందుకే 'అమ్మ'
అంటే అందరికి
అంత యిష్టం
అందుకే అమ్మ అంటె
పిల్లలందరికి
అంత ప్రేమ

అమ్మ ఒక్కతే

ఈ సృష్టికి
దేము డొక్కడె
సూర్యు డొక్కడె
చంద్రు డొక్కడె
ఆకాశ మొక్కటె
భూమి ఒక్కటె
జనన మొక్కటె
మరణ మొక్కటె
మనసు ఒక్కటె
మాట ఒక్కటె
అమ్మ ఒక్కతె

అమ్మే యేడుగడ

చిన్న తనమున తల్లి రక్ష
పెరిగిననాడు తండ్రి రక్ష
వయసున పురుషుడు రక్ష
వయసు మీరిన తనయుడు రక్ష
విద్య నేర్పిన నాడు గురువు రక్ష
బ్రతుకు బాటలో విద్య రక్ష
కష్ట సుఖాలలో దాత రక్ష
సర్వవేళల దైవము రక్ష
అన్ని రక్షలు తానై
సాకేది అమ్మ
అమ్మే అందరికీ యేడుగడ

సృష్టికర్త

మానవ మనుగడకు
నాంది అమ్మ
మానవ ప్రగతికి
జీవం అమ్మ
అమ్మ లేనిదే
జీవరాశి యెక్కడ
అమ్మ లేనిదే
ఆ దేవుని
సృష్టి యెక్కడ
అమ్మే ఆదిశక్తి
అమ్మే సృష్టికర్త
అమ్మే సృష్టికి
నిలయం
అందుకే అమ్మా
పిలుపులో నిత్తీపి
పదానికున్న శక్తి
భావానికున్న బరువు
సృష్టిలో మరిదేనికున్నది
భౌతిక అంతరంగిక
శబ్దాలు అన్ని
భావాలు అన్ని
అమ్మలోనె
ఇమిడిపోతాయి,

మొదటి గురువు

కనేది అమ్మ
పెంచేది అమ్మ
ఉగ్గు పాలతో
చేదు తీపులను
తాగించేది అమ్మ
జీవితంలో
కష్ట సుఖాలను
ఒంట బట్టించేది అమ్మ
తప్పటడుగులు
వేయించేది అమ్మ
సరిదిద్దేది అమ్మ
మాటను నేర్పేది అమ్మ
అర్థం నేర్పేది అమ్మ
భావాలకు రెక్కలు
విప్పేది అమ్మ
ప్రకృతి లో
ప్రతి వస్తువును
చివరకు తండ్రిని కూడా
పరిచయం చేసేది అమ్మ
సంఘ జీవనాన్ని
చిగురింప చేసేది అమ్మ
తప్పు చేస్తే
దండించేది అమ్మ
నేరం చూపి
శిక్షించేది అమ్మ

న్యాయ మూర్తికి
పాఠాలు నేర్పేది అమ్మ
మనుగడకు
వెలుగు బాటను
వేసేది అమ్మ
అమ్మ కోటి ఆశయాల
పంటే బిడ్డ
అమ్మ మాటను
మించిన దండం
అమ్మ చేతను
మించిన రక్షణ
మరెక్కడా
అలభ్యం
నీతి నియమాలను
నేర్పేది అమ్మ
ధీర కరుణ శాంత
రసాలను గుండెలో
నారుపోసేది అమ్మ
ప్రేమ వాత్సల్యాలకు
నీరు పోసేది అమ్మ
అందుకే అందరికీ
మొదటి గురువు అమ్మ

అమ్మ దాత

కాలే కొవ్వొత్తిలా
తాను కరిగిపోతూ
తన ఆశలే
జీవన జ్యోతులై
వెలుగు నింపగా
ఆ వెలుగులో
తన శక్తిని
తన ఉక్తిని
తన సర్వస్వాన్ని
తనయులకు
ధార పోసె దాత అమ్మ
ప్రతి ఫలం కోరని
దాత అమ్మ
అమ్మ త్యాగ నిరతే
దేశం కోసం ప్రాణాలను
బలిపెట్టే
సిపాయిలకు
జాతినేతలకు
త్యాగశీలురకు
ఆదర్శమై నిలిచింది
ఆరని జ్యోతియై
వెలిగింది.

అమ్మె విద్య

పలక పట్టించేది అమ్మ
పలుకులు నేర్పేది అమ్మ
పాఠాలు నేర్పేది అమ్మ
ఆటలు నేర్పేది అమ్మ
పాటలు నేర్పేది అమ్మ
పనులు నేర్పేది అమ్మ
పుస్తకాలు చదివించేది అమ్మ
లోకాన్ని చూపేది అమ్మ
జీవిత సత్యాలను బోధించేది అమ్మ
ఇంటి గుట్టును దాచేది అమ్మ
అమ్మె కీర్తికి నేస్తం
అమ్మె పొదుపుకు నిలయం
అమ్మె జ్ఞానానికి ఆధారం
అమ్మె ఆర్జనకు దోహదం
అమ్మె సంఘానికి ఆధారం
అమ్మె మన బ్రతుకు బాటకు
సోపానం
అమ్మ అనుభవాలకు
మించిన విద్యలెక్కడున్నాయి
అమ్మె సర్వ విద్యలకు
నిలయం

అమ్మే దైవం

నవమాసాలు
బాధల సంకెళ్ళను
మోదముతో తాల్చి
పాపు బ్రతుకుల
సంధ్య చీకట్లో
పోరాడి పోరాడి
మరణించి
జీవించి
చిరునవ్వుల
పాపల అందాలను
ఆనందాలను
తండ్రి తాతలకు
అందించేది అమ్మ
వంశాన్ని నిలిపేది అమ్మ
కంటి రెప్పల మాటున
పసి కందులను
సాకేది అమ్మ
అమ్మ కున్న నేర్పు
ఆ బ్రహ్మ కెక్కడిది
అమ్మ కున్న ఓర్పు
ఆ భూమి కెక్కడిది
అమ్మ కున్న ప్రేమ
ఆ దేముని కెక్కడిది
అందుకే అందరికీ
అమ్మే దైవం

అమ్మ ప్రేమ

అమ్మ ప్రేమకు
ఆనకట్టలు లేవు
అమ్మ ప్రేమకు
పిల్ల కాలువలు లేవు
అమ్మ ప్రేమకు
చట్టాలుసవరణలు లేవు
అమ్మ ప్రేమకు
పొట్టిపొడుగు
భేదాలు లేవు
అమ్మ ప్రేమకు
నలుపు తెలుపు రంగులు లేవు
పదిమందిని కన్నా
పదిలంగా అందరికీ
ప్రేమను పంచి
ఇచ్చేది అమ్మ
ప్రాసుకే తూకం
నేర్పేది అమ్మ
అమ్మ ప్రేమకు
ఆడంబరాలు లేవు
అమ్మ ప్రేమకు
అతిశయోక్తులు లేవు
అమ్మ ప్రేమ
జలనిధి కన్న లోతు
అమ్మ ప్రేమ
మేరువు కన్న గాంభీర్యం

అమ్మ ప్రేమ
ఆకాశం కన్నా విశాలం
అమ్మ ప్రేమ
అమర నది కన్నా నిర్మలం
అమ్మ ప్రేమ
కైలాస శిఖరం కన్నా ఉన్నతం
అమ్మ ప్రేమ
భూమి కన్నా భారం
అమ్మ ప్రేమకు
చెదలు లేవు
అమ్మ ప్రేమకు
శిథిలం లేదు
అమ్మ ప్రేమ
ఊట బావి
ఎంత చేదుకున్నా తరగదు
అందుకే
ప్రతి శిశువుకు
అమ్మే కావాలి

అమ్మే సర్వం

చందమామ అదిగో
జాబిల్లి అదిగో
తారలవిగో
సూర్యబింబమదిగో
ఆకాశమదిగో
తొలి మబ్బులవిగో
దిక్కులవిగో
అంటూ తీయని
పలుకులతో
నీమనసువే
అర్థముగ జేసి
భూగోళాన్నే
పరిచయంచేశావు
కాకతిరుద్రమ
ఛత్రపతి శివాజీ ఝాన్సీ రాణీ
జాతి వీరులను
గాంధీ తాత
నెహ్రూ చాచా
జాతి నేతలను
పెంచి పెద్దగ చేసిన
మహా తల్లులు
నీ ముందు తరము
వారమ్మా
అమ్మే పోసింది ప్రాణం
నింపింది శక్తి

నేర్పింది వీరం
కూర్పింది త్యాగం
అమ్మే సర్వమై
ఎల్లవేళల
అండగ నిలిచింది

అమ్మే ఇంటి దీపం

పండేది అమ్మ
పెట్టేది అమ్మ
ఇంటిని దిద్దేది అమ్మ
పిల్లలను పెంచేది అమ్మ
భర్త అవసరాలను
తీర్చేది అమ్మ
ఇంటి కొచ్చిన వారిని
ఆదరించేది అమ్మ
ఒంచిన సిరుసు
ఎత్తనిది అమ్మ
మూసిన నోరు
తెరువనిది అమ్మ
చదువులు నేర్పేది అమ్మ
పాడేది అమ్మ
ఆడేది అమ్మ
చిత్రాలు వేసేదిఅమ్మ
చిత్రాలు చేసేది అమ్మ
అమ్మే యింటి దీపం
అమ్మే వీధికి అందం
అమ్మే దేశానికి ఆనందం

అమ్మే కవచం

ముద్ద బంగారము వంటి
పసిపాపలను సానపెట్టి
జాతి రత్నములుగ
తీర్చే అమ్మ కన్నులలో
శౌర్య మార్ధవాలు
సూర్య చంద్రుల్లా
చోటు చేసుకుంటాయి
పిల్లలకు రోగమొస్తే
కన్నీరొలకించి
పక్క విడువక
సేవలు చేసేది అమ్మ
తప్పుచేస్తే దండించేది అమ్మ
ఆకలి వేళలలో
అన్నీ వండి పెట్టేది అమ్మ
ఓ అమ్మా
నలభీమ పాకాలలో
నీ ప్రేమ తీపి ఎక్కడిది
నీ అభిమానపు రుచి యెక్కడిది
ప్రకృతినన్ను భయపెడితే
జనమే నన్ను బెదిరిస్తే
స్నేహితులే చేయి ఎత్తితే
పరుగు పరుగున వచ్చి
నీ పమిట కొంగునే కప్పుకొని
నిండుగ ఊపిరి పీల్చుకుంటాను
ఓ అమ్మా

త్రిశూలము కన్నా
తుపాకి కన్నా
నీ పమిట కొంగు చాటు
నాకు రక్షణ
ఎల్ల వేళల నన్ను, చుట్టి
తిరుగు నీ చూపులే
నా దేహానికి
నా ఆత్మకు
నిండు కవచాలు

అమ్మ పిలుపు

నా చిట్టి తల్లీ
నా చిట్టి తండ్రిరా
అటంచు
పిలుచు అమ్మ పిలుపే
కోకిల గానము కంటె
వీణానాదము కంటె
మోహనమురళి కంటె
మధురాతి మధురమై
హృదయమునే
తట్టిలేపు
కోటి అనురాగపు జల్లులై
ఎదనే మురిపించి
పురులు విప్పి
నాట్యాలు చేయించు

లోకమేరుగని
పసిపాప కూడా
అమ్మ పిలుపు విని
ఏడుపునే మానివేయు
భయాన్ని వదిలి వేయు
అమ్మ పిలుపే
పెట్టని కోట్ల
అమ్మ పిలుపే
తొరగని కవచం
అమ్మ పిలుపే
ఆనంద నిలయం

అమ్మే ఈజగము

ఎండకు వానకు ఓర్చి
పొలము పనులు చేసేది
బంగారపు పంటలు
పండించేది ఒక అమ్మ
పసికందులను గాలికి వదలి
పొట్ట పోషణకై
మెదలు వరిగిపోవ
మట్టి తట్టలు
మోసేది ఒక అమ్మ
బ్రతుకు తెరువుకై మండుటెండలో
బండ రాళ్ళు పగులకొట్టేది ఒకఅమ్మ
యంత్రాగారాలలో

మరలు తిప్పేది ఒక అమ్మ
ఫ్యాక్టరీలను నడిపేది ఒక అమ్మ
దేశ సంపదను
పెంచేది ఒక అమ్మ
ప్రాణాలపై తీపి వదిలి
తుపాకి చేతపట్టి
దేశరక్షణకై
నిలిచేది ఒక అమ్మ
సందాలు వదిలి వైద్యమే నేర్చి
ప్రాణాలను కాపాడేది ఒక అమ్మ
ఎలక్షన్స్‌లో ఎన్నికై
పంచాయతీలను పాలించేది
దేశాలను ఏలేది ఒక అమ్మ
చదువులు చదివి
సంపాదనలు నేర్చి
సంతోషాలు వదలి
కొడుకై కన్న తల్లితండ్రులను
పోషించేది ఒక అమ్మ
చివరకు తన కుటుంబాన్నె
పోషించునది ఒక అమ్మ
అన్నీ తానే నేర్చింది
అన్నిట తానై నిలిచింది
అమ్మే ఈజగమై పోయింది.

దేశభక్తి

రాట్నమే తిప్పావు
నూలునే ఒడికావు
ఖాదీనే కట్టావు
దొరలనే ఎదిరించావు
జైలుకే వెళ్ళావు
ఇల్లు వాకిలి అనుకొనక
దేశానికై సర్వమును
ధారపోశావు
స్వార్థపరుల
కళ్ళు తెరిపించావు
స్త్రీ శక్తిని
చాటిచెప్పావు
నీ దేశభక్తిని
నిరూపించావు

అనాథులు

అమ్మ ప్రేమ ఎరుగని
అనాథు లెందరో
అమ్మకొరకై
అలమటించి పోతారు
తల్లి పోయిన పిదప
కన్న తండ్రి కూడా
మారుతల్లి చేతిలో
మట్టి బొమ్మగ మారి
మారు తండ్రై పోతాడు
మనసునే గుడ్డిగ
చేసుకుంటాడు
పిల్లలపై ప్రేమనే
నిలువున చంపుకుంటాడు
ఆకలి వేళలలో
అమ్మే కావాలి
అమ్మ చేతి
గంజికూడు కూడా
గడ్డికూర కూడా
అమ్మ ప్రేమతో తడిసి
అమృతమై పోవు
కష్ట మొచ్చినా
నిద్ర వొచ్చినా
అమ్మ అమృత
హస్తమే కావాలి
అమ్మ ఒడే కావాలి
అట్టి అమ్మలేని
అనాథులకు
ఈ లోకంలో

ఆదరణే కరువాయె
మరో జన్మకైన
అమ్మ ఒడే దొరకాలి.
అమ్మ ప్రేమ లభించాలి

అమ్మ పెంపకం

అమ్మ ప్రేమను
నిలుపుకోలేని
తనయు లెందరో
భార్యకు దాసులై
గతాన్ని మరచి
ధర్మాన్ని మరచి
చివరకు
కన్న తల్లి దండ్రులనే
మరచిపోయె
నిద్రపత్తు తనయు లెందరో
చిరాస్తు లమ్మి
రెక్కలు విరుచుకొని
ఒంటి నగలనే పొలిచి
తమ భవిష్యత్తునే
మరచి చదివించే
అమ్మానాన్న లెందరో
కూటికి గుడ్డకు
దూరమైన వారెందరో
హోదాలు చాలవని
తల్లి దండ్రులను

తలెత్తిచూడని
కుమారవంచకు లెందరో
కన్న వారిని పనివారిగ చెప్పుకొనే
దౌర్భాగ్య పుత్రు లెందరో
కుక్కలికు పాలు పోసి
కిన్నవారికి
గంజి నీళ్ళుపొయ్యని
పాతబట్టలివ్వని
కొడుకు దద్దమ్మ లెందరో
వారి గుండెలు
బండ రాళ్ళు కాబోలు
వారి మనసులు
నల్ల రాతి కాబోలు
వారి బుద్ధులు
యడారులు కాబోలు
వారివి మార్చే నాథులు లేరు
వారిని మార్చే చట్టాలులేవు
వారి పాపాలకు శిక్షలేలేవు
అమ్మప్రేమ
వారిని మార్చాలి
అమ్మ పెంపకమే
వారిని మార్చాలి,

నలుపే దోషమా !

అమ్మ కలలు పండి
కడుపు పండి
నేను లోకాన్ని
చూసిన నాడు
లోకం నన్ను చూసి
పళ్లు పైకి పెట్టి
నోరు తెరవగా
మూగ బాధతో
మెలికలు తిరిగి
వెలితివోరు వారి
కంట పడకుండా
నీ గుండె గూటిలో
వెచ్చగా దాచుకున్నావు
నా కన్నులలో
కాంతులు వెదకి
నా చేత లోని
చురుకు తరచిచూసి
శివుని అర్థాంగి
ఆది శక్తి అన్నపూర్ణ
పార్వతి నలుపు
పంచపాండవుల
పట్టపురాణి
ద్రుపద మహిళ
ద్రౌపది నలుపు
ఆది దేవుడు

అమర పండితుడు
విష్ణువు నలుపు
నలుపులో
అందముంది
నలుపులో
మహిమ ఉంది
నలుపులో
శక్తి ఉంది
దేహము నలుపు కాని
మనసు నలుపు కాదు
మల్లెపూవు తెలుపని
మురిసి పోయావు
తెలుపే లోకానికి
మెరుపని
నలుపు నాయుగు
వంకర్లను మోసుకొస్తుందని
నా గుండెలో బాకులా
గుచ్చుకున్న భయాన్ని
వెలికి తిక్కించావు
రంగు రూపు భేదాలు
కన్న కడుపుకు లేవు
పుట్టిన యింటికి లేవు
పెంచిన ఊరుకు లేవు
పెరిగిన దేశానికి లేవు
ఏ యీ సమబుద్ధి
ఏ శాస్త్రము బోధించ గలదు
ఏ చట్టము గుర్తింప గలదు
ఏ చదువు నేర్ప గలదు

ఏ గురువు అందించ గలడు
బుద్ధ భగవానుడు
తన మతమునకు
పునాది రాళ్ళగ
వేసుకున్నాడు
జాతినేత
గాంధి తాత
ఆ పునాది పై
రాజ్యాన్నే నిర్మించాడు
అందరికి అచరణలో
అందించాడు

నిబ్బరం

అమ్మా అన్న పిలుపే
తాల వృంతమై
మలయ పవనాలను
కదిలింపగా
తెల్లని జాబిల్లియై
చల్లని వెన్నెల
వెదజల్లగా
అమృత భాండమై
చిరు జల్లులు
కురి పింపగా
పరవసించిన నేను
అరగడియ సేపు
అమరత్వమునే
పొందాను
అనంత లోకాలను
చుట్టి వచ్చాను
ఈ జగాన్నే
మరచి పోయాను
ఓ ! అమ్మా
నీ వాత్సల్యపు
పొంగలో
కఠినశిలా
మనో వేదికలే
చూర్ల మవుతాయి

ఘోర పాపములే
కరిగి పోతాయి
నీ వాత్సల్యమే
క్షమింపగా
తప్పు చేసిన నేను
నిలువెల్లా
ఒణికి పోయాను
ఎన్నటికీ తప్పు
చేయనని
గుండెలో చెక్కుకున్నాను
అందుకే
ఓ ! అమ్మా
ఆటలలో
అందె వేశాను.
పాటలలో
రాగాలు పలికించాను
చదువులకే
సరస్వతి నయ్యాను
అందరి ఎదుట
నిబ్బరంగా నిలిచాను

అమ్మ దీవెన

అమ్మా
నీవు తినిపించు
గోరు ముద్దలే
నాకు పంచ భక్ష్య
పరమాన్నములు కేగా
నా మనస్సునే
వెన్నగ చేశావు
నా జీవితానికే
వెన్నెల బాట
వేశావు
ఏనాడో
నా బాల్యము గతించినా
ఏ నాటికి నేను
నీ పసి పాపనే
అద్దాలలో బిడ్డనే
నీవు చెప్పే
నీతి కథలు
జాతి నేతలు
త్యాగ శీలుర కథలు
సత్యహరిశ్చంద్రుని కథలు
ఒంట బట్టించావు
తిరిగి నాచే చెప్పించి
పాఠాలు చెప్పడం
అలవాటు చేశావు
అందరిని

అలరించడం నేర్పావు
నోటి మాటలే
మంచి ముత్యాల
మూటలు కావాలని
పన్నీటి జల్లులు
కురిపించాలని
ఏ నాటికి
నా వెంట ఉండాలని
దీవించావు
అందుకే ఓ అమ్మా !
ఏ నాటికి
నీ ఒడే నాకు
పూల పాను కావాలి
నీ తీయని పలుకులే
నాకు దీవనలు కావాలి

అమ్మ స్వర్గం

నీ చల్లని ఒడి
ఊగుటుయ్యాలై
నను జోకొట్టగా
నీ భుజమే
పట్టు పరుపు పరుస్తూ
మెత్తనై
నన్ను నిద్రపుచ్చగా
నీ చనుబాలే
అమృతపు ధారలై
నా కడుపు నింపగా
ఒంటినే నింపుకున్నాను
బలమునే పుంజుకున్నాను
తెలివినే అందుకున్నాను
నా ఆయుష్షునే
పెంచుకున్నాను
దైవ మెవ్వడు
చూడని నేను
నువ్వే నాదైవ
మను కున్నాను
స్వర్గ మెరుగని నేను
నీ చేతులలో
స్వర్గ సుఖాలను
చవి చూశాను

అమ్మ నెచ్చెలి

ఈ భూమిపై
నేను కాలుపెట్టిననాడు
మనసు లేని నేను
మాట లేని నేను
చూపులేని నేను
ఒప్పులు లేని నేను
నడక లేని నేను
ఏడుపు తప్ప
మరేది తెలియని నేను
నీ చేతి స్పర్శను
నీ ఒడి తీపిని
పసి కట్టావు
ఈ భూమిపై
అదే నాకు
రక్ష అనుకున్నాను
రోజులు కదలగా
నెలలు నిండగా
నీ మాటనే
నీ చూపునే
నీ నడకనే
నీ మమతనే
పసి కట్టాను
కన్నెర్ర చేస్తే
గుక్క పట్టాను
చిరునవ్వు చిందిస్తే

పకపకా నవ్వాను
నీ కను పాపలలో
జాబిల్లి నై
దోబూచు లాడాను
నీ నగు మోములో
పాల వెల్లనై
పరవశించి పోయాను
నీ పసిడి చేతులలో
తారనై వెలిగిపోయాను
నీ తీయని పలుకులే
మంచి గంధపు
పూతలు కాగా
నీ తోనే ఆడుతున్నాను
నీ తోనే పాడుతున్నాను
నీ తోనే కబురులు చెప్పాను
నీవే నా
వెచ్చెలి వవుతున్నాను

అమ్మో పాపం

చిన్నారుల
చిరు నవ్వులను
చిదుముతున్నారే
అమ్మలెందరో
కొంటె [illegible]
[illegible] చేష్టలను
కోపము తెచ్చునే
అమ్మ లెందరో
ఉత్తుత్త కోపముతో
పుత్తడి చిన్నారుల
పిల్లలను బాధించే
అమ్మ లెందరో
మరియు పెద్దల్లూ
తమ సుఖాలకై
తమ స్వార్థాలకై
పసి పాపలను
ఇంటి నుంచి
తాళము వేయుగా
ఆకలి మంటలతో
ఒంటరి ఆరాటముతో
జతవారికి దూరముగా
పంజరము లోని
మసలుతున్న పక్షుల్లా
చెదరి పోయి
చెదరి పోయి

కోపిష్టే పిల్లలెందరో
పని మనిషి చేతిలో
నలిగి పోయే
పసి కూన లెందరో
ఒంటరి తనముతో
మనసు పగిలిపోతుందని
భయముతో
గుండె జారుతుందని
తల్లి దండ్రులపై
కక్ష తీర్చుకోవాలని
కత్తులు పట్టే
తనయు లెందరో
జేబులు తడిమే
పిల్ల లెందరో
ఇరుగు పొరుగులతో
మాటలు చేతలు
కలిపే దెందరో
చివరకు
తల్లి దండ్రులనే
నిరసించే పిల్లలెందరో
ఉన్నారన్న నీమాటలే
నా చెవులలో
ప్రతి ధ్వనిస్తాయి
ఏ సైకాలజిస్టు
ఏ పిల్లల స్పెషలిస్టు
శాసించ లేని
యదార్థ సత్యమిది

నిప్పూ నీళ్లకు
తేడా తెలియని
పసివారు పిల్లలు
తెచ్చుకునే ఆపదలు
అందుకొనుటే కాని
అడ్డు కోలేవి
అనాథలు అబలలు
పిల్లలని
అమ్మే తపనమై
కాపాడాలి
అమ్మే తోడు నీడై
విలువల
ఓర్పు నేర్పు
తల్లులందరికీ
తప్పక ఉండాలి
పదిమంది నైనా
ఆ రెండు కళ్లతోనే
చూడాలి
ఒకే మనసుతో
ప్రేమించాలి
ఎప్పటికీ
ఎన్నటికీ
పిల్లలకు
తల్లి ప్రేమే
ప్రధాన పోషకమని
నిరూపించావు
దానిని మించిన
ఔషధము
లేనే లేదన్నావు

అమ్మ ఆదరణ

పాలు తాగనని
అన్నము తిననని
అల్లరి మానని
మారాము చేస్తే
నీ ఓర్పును
నీ ప్రేమను
పణముగ పెట్టి
బ్రతిమి లాడావు
నోరు తెంచి అడగకముందే
అన్నీ అందించావు
చేయియెత్తి
దెబ్బవేయ కుండగనే
తర్జనితో బెదరించి
పెంచి పెద్ద చేశావు
పెద్దల యెడ
భక్తినే పెంపొందించావు
అల్లరి, పిల్లలు
చేయక పోతే
పెద్దలు చేస్తారా ? అని
పిల్లలు లేనిదే
సందడే ముండని
అల్లరి లేనిదే
ఆనంద మేముందని
సరిపెట్టు కున్నావు
నాకు ఓర్పు నేర్పు

ప్రేమ ఆదరణ
అందించావు
లోకాన్ని ప్రేమించడం
నేర్పావు
నీ చిరు నవ్వులలో
పెరిగిన పూవులకు
నీ అడుగు జాడలలో
పడచిన కుర్రలకు
కాలికే
తప్పటడుగులు కాని
మనసు కెక్కడిద
అందుకే
ఎన్నటికీ
నీ ఆదరణే
నాపై ప్రసరించాలి
నన్ను చల్లగ చూడాలి
జన్మ జన్మలకు
నీవే నాతల్లివి కావాలి

మా పూర్వ జన్మ
సుకృత్ ఫలము కాబోలు
శ్రీ కాశాచయినుల సూర్యనారాయణ
శ్రీమతి లక్ష్మిదేవమ్మగార్లమ
తల్లిదండ్రులుగ ప్రసాదించి
మాట నిట్టుకొనె
పుణ్యంబు బ్రహ్మ
మా అమ్మ మాట
కాదని యెరుగరు మానాన్న
మా నాన్న మాట కాదనుటే యెరుగక
అర్ధాంగి అను మాట
సార్థకము చేసుకున్నది మా అమ్మ
స్వరాజ్య సమరాన
కాంగ్రెసులో చేరి నాయకుడై
ముప్పిరికొను దేశభక్తితో
మడులు మాన్యాలు మూలధనము
దేశమునకై వెచ్చించ మా నాన్న
కించిత్తు తడబడక
ఒంటి మీది నగలెల్ల ఒలిచిఇచ్చినది
దేశభక్తి నిలుపు కున్నది మా అమ్మ
విదేశ వస్త్రాలను
నడి వీధిలో మానాన్న
పోగు పెట్టి దహనముచేసి
గుండెలోని జాతి సత్యాన్ని
నిలుపునా కాల్చి వేసుకోగా
విదేశ వస్త్రాలను
వెతికి వెతికి తీసి
అగ్నిలో ఆహుతి చేసి

గుండెలోని ఉద్యమాన్ని
భగ భగ మండించె మా అమ్మ
ఖాదీ బట్టలు తెచ్చి మా నాన్న
పది మందికి పంచి పెట్టగా
ముతక అనక
సంతసమున ఖాదీ చీరనే
కట్ట త్యాగ నిరతిని
నిరూపించింది మా అమ్మ
అన్నదానలు మా నాన్న చేయ
గుండి గలనే దండిగ వార్చిది అమ్మ
ఓ అమ్మా
తెచ్చి పెట్టుట మానాన్నవంతయ్యా
వండి పెట్టుట నీవంతయ్యె కదమ్మా
జాతి నేత జయ ప్రకాష్
ఆంధ్రకేసరి టంగుటూరు
పట్టాభి సాంబమూర్తి
కళా వెంకట్రావుగారలు
నీ చేతి వంట రుచి చూసి
నీ అదృష్టమట్టిదని
మురిసి పోయి యిల్లాళందరకు
ఆదర్శంగా నిలిచితివి కదమ్మా
ఆదర్శమూర్తి
శ్రీమంతెన వెంకటసుబ్బరాజుగారు
మా నాన్నకు ఆత్మీయులై
యమ్. ఎల్. గా ఎన్నిమారులో ఎన్నికై
ఏనలేని సేవ చేయుచుండ
కొత్తపేట తాలుకా

అదృష్టమని మురిసితిమి కదమ్మా
జాతీయోద్యమంబు పెల్లుబికి
మా నాన్న కారాగారానికి
కదలి వెళ్ళవలసి రాగా
వీరగంధము మాటలలో పులిమి
ఘన సంతసమున
సాగనంపినావు
దేశభక్తి దైవ భక్తి కన్నమిన్న
యని చాటిచెప్పినావు
ఎవ్వరేయే వేళల యింటి కొచ్చినా
స్వార్థమువు ఆరు బయటవదిలి
మర్యాదలు సలిపినావు
అన్నకు తమ్ముడై
శ్రీ సుబ్రహ్మణ్యము
మానాన్నకు ఆత్మీయుడు కాగా
మరదిని కన్నకొడుకు కన్న
మిన్నగ చూచినావు
తోడికోడలు చిట్టి తల్లని
నీ చెల్లెలు ఘాదేతో
సమముగ ఆదరించినావు.
నీ నడత ఆడువారికి
ఆదర్శము కదమ్మా
ఘన జటా వల్లభుల వంశము
నీకు పుట్టినిల్లయ్యె
దేశ విదేశ ప్రఖ్యాతులు
లక్ష్మీనారాయణశాస్త్రిగారలు
(లేటు) పురుషోత్తము
సత్యనారాయణగారలు

నీకు అన్నదమ్ములై
నిన్ను ఆదరించిరి
నీ అదృష్టమేట్టిదో కదా !
హక్కులు మాట
అడిగి యెరుగవు
చట్టాల ప్రసక్తి
ఎత్తి యెరుగవు
అన్ని హక్కులు బాధ్యతలు
హాయిగా అంది పుచ్చుకొని
అమర్చుకొన్న నేర్పరివి నీవు
నీ జీవితము అన్నిట
ఆధునిక వనితా లోకానికి
ఆదర్శము కదమ్మా
తూర్పు వాకిట తొలిపొద్దు
తొంగి చూడక మునుపే
తొట్రు పడుచు లేచి
కుక్కుట రాజములనే
నిద్ర లేపు నీకు
గంటలు కొట్టు
గడియారా లెందుకమ్మా !
తెల్లవారక మునుపే
ఇల్లు వాకిళ్ళను
రంగవల్లులతో
సింగారించు నీవు
పని మనిషికై పరితపించు
పేదచేత వారికి
పనులు చేసి చూపించి
బిజ్జ బంతివైతివమ్మా

ఉభయ సంధ్యలలో
వేళ మించక
పాడి పశువుల దరిచేర
నోరు లేని పశుసంతతి
నీ చల్లని చూపులకే జలదరించి
కడివెడు పాలను గుమ్మరించు కదమ్మా
చల్ల చిలుకుటకై
ఖాండము సమీపించ
అలసట ఎరుగని
నీ చురుకు వేడిమి కే
అర నిమిషములో
పట్టెడు వెన్న పైకి తేలు కదా।
చంటి పిల్లలు నిద్రలేచి ఏడువ
చనుపాలిచ్చి జోకొట్టినావు
ఎడ పిల్ల లేచి పేచీలు పెట్ట
ఏనుగమ్మ ఏనుగు అటంచు
వంగిన నీనడుము పైకి చేర్చుకొని
గుండెలో సంతోషము
గూడు కట్టుకొనగ
మోముపై ఆనంద జ్యోతులు
హారతులు పట్ట
ఇంటిడి పనిని
చక చకా చేసికొనుచు పోవు
ఓ ! అమ్మా
లోకాన గల చురుకు అంత
నీ చేత యిమిడె కదా
నీ యింటి అదృష్ట
మెట్టిదో కదా।

పాత్రలు గలవారి కోడలు
పనిమంతు రాలు
చిప్ప గలవారి కోడలు
చిత్రాంగి అనుమాటలకు తోడుగా
మెరుపున్న కోడలు చూడమణి
నేర్పున్న కోడలు నెలవంక
అను సామెతలు
సృష్టించితివి కదమ్మా
ఇంగ్లీషు చదువులు
నీకు తెలియవు
వీధి బడె నిన్ను చదివించె
దేవ భాష నిన్ను వరించె
రామాయణ భారతాది
మహా గ్రంథములు
నీజ్ఞానమునకు నారుపోసె
పురాణములు నీజ్ఞానమును
పాలు పోసి పెంచె
వేద శాస్త్రములు నీతన
జ్ఞానజ్యోతులు వెలిగించె
పెద్దల మాటలె నీకు
వెలుగు బాటలు వేసె
వైద్యశాస్త్రము నేర్వనే
లేదు నీవు
పిల్లల పెంపకానుభవములె నీకు
పాఠాలు నేర్పి
గృహవైద్యాన్ని అలవాటు చేసె
ఇరుగు పొరుగులకు
చుట్టు పక్కల వారికి

ఉచిత వైద్యము
ఉడతా భక్తిగ
చేయ వేర్పైతివి
పొరుగు వానికి తోడువడు
నీ స్వభావ మెన్న తరమే
నీ యింటి ముంగిట
భిక్షాందేహి అటంచు
ఎవరు నిలిచిన
భిక్ష మిడక పంపుట
నీకు విరుద్ధము కాదె
నీ యింటి పాడి రుచి
నీ దొడ్డి పంట తీపి
ఎరుగని అగ్రహారీకు
లుండుట
ఆత్రీయ పురమున అరుదు కాదె
చేసిన ధర్మాన్ని చెప్పుకొనుట
శీలానికీ దోషమన్నవు
నీకు తెలియని
శాస్త్రాలు కలవె
ఏనాడు చేసిన పుణ్యఫలమో
ఈనాడు నీ యింట
ఇన్ని సంపదలు నిలిచె
జన్మ జన్మలకు నీయింట
నీ సంపదలు నిలిచి పోవాలని
ఉన్న దానిని పంచుబుద్ధి
నీకు అలవడె కాబోలు నమ్మా !
నీ పిల్లలు భయము చేత
గోలచేయుచు నిన్ను వదలకుండ

పక్కన చేర్చుకొని
నీవు పాడు భక్తి గీతాలకే
పారి పోవు భయము
మహిమ నీభక్తిరో నున్నదో
నీ గొంతులో నున్నదో కదా ।
ఓ । తల్లి దండ్రులారా ।
పుణ్య దంపతులారా ।
పంచ పాండవులవలె
కన్నారు కొడుకులను
అపురూపముగ పెంచినారు
అందుకే మరి దేశాలనే
ఏలుచున్నారు వారు ఇప్పుడు
మీ పేరుకే వన్నె
తెచ్చుచున్నారు నేడు
కన్నారు పంచకన్యలను
అతి సౌందర్య సుగుణ
రాసులను వారు
మరి ఎవరితో పోలికే లేదు
మీ పోలిక మీదే కదమ్మా !
మీ పరువు పెంచ
కోడళ్ళు లభించి
మీ కులమునే
ఆ కాశమునకు ఎత్తె కదా ।
మీ మంచి తనమునకు
మారుగ అల్లుళ్లు లభించి
మీ మంచినే పెంచె కదా !
మీ నోటి మంచి తనమే
మీ నిస్వార్థ బుద్ధే

మీ త్యాగనిరతే
మీకు తోడయ్యే
ఇరుగు పొరుగులకు
చుట్టాలకు బంధువులకు
భేదమే లేదు మీకు
మీ యిల్లే మీవీధి
మీ వీధే మీవూరు
మీ వూరే మీదేశ
మయ్యే మీకు
మీ సమ భావం
మాకు తెలియనగునే
అందుకే
ఓ అమ్మా ! ఓ నాన్న !
జన్మ జన్మలకు మీరే
మాకు అమ్మ నాన్నలు కావాలి
నా జన్మలు
సార్థకము కావాలి.



AMMA

By

Dr. Vasa Prabhavathi

BALAJI FINE ART PRINTERS, Malakpet, Hyderabad 500 036.